
సాక్షి ఒడిశా

శనివారం । 24 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,32,756లు, బంగారం 550 మిల్లీగ్రాములు, వెండి 107.10 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కూర్మావతారంలో కమల లోచనుడు -10లో



రాష్ట్రంలో యంత్రాంగ పాలన -10లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు



కలెక్టర్ లింగరాజ్ పండాతో ఏడీఎం రాజేంద్ర మింజ్, రిజిస్ట్రార్ నాయక్

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ సంచాలకులుగా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పలువురు ఉన్నతాధికారులు, ప్రజాసంఘాలు, మీడియా ప్రతినిధులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. 2021 జూలైలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. జిల్లాలో మహిళా సాధికారత, మిషన్‌శక్తి భవనాల నిర్మాణం, బాల్య వివాహాల నిర్మూలనకు ఎంతో కృషి చేశారు. 36 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు స్మార్ట్ క్లాసులుగా తీర్చిదిద్దడంలో సఫలీ కృతులయ్యారు. జిల్లా మినిస్టీరియల్ సంఘం, రెవెన్యూ ఉద్యోగులు, ఎక్సైజ్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఈ సందర్భంగా పండాను సత్కరించారు. అలాగే జిల్లాకు నూతన కలెక్టర్‌గా స్మృతిరంజన్ ప్రధాన్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

జేకే పీహెచ్‌సీలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సిబ్బంది

రాయగడ: పట్టణానికి సమీపంలోని జేకే పేపర్‌మిల్ ప్రాంగణంలో కర్మాగారం వ్యవస్థాపకులు హరిశంకర్ సింఘానియా 90పుట్టిన రోజు పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జేకే మహిళా క్లబ్ అధ్యక్షురాలు శ్వేత ద్వివేది ముఖ్య అతిథిగా హాజరై, శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం మహత్తరమని, ఈ విషయంలో యువత ముందుండాలని సూచించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే స్వభావం అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఇందులో కర్మాగారం ఉద్యోగులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని, రక్తదానం చేశారు. రాయగడ రెడ్‌క్రాస్ సిబ్బంది పరివేక్షణలో మొత్తం 140 యూనిట్ల రక్తాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పేపర్ మిల్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు(వర్క్స్) వినయ్ ద్వివేది, ఉపాధ్యక్షుడు(కమర్షియల్) సందీప్ పాండే తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో రథాయాత్ర సందర్భంగా పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మీనా బజార్‌లో పోలీసులు గురువారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. మీనాబజార్ పేరిట జూదం అడ్డా నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టారు. ఇందులో ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి, రూ.6,770ల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందుతులపై కేసు నమోదు చేసి, శుక్రవారం ఉదయం కోర్టులో హాజరు పరిచామని ఆదర్శ పోలీస్ స్టేషన్ ఐఐసీ నీలాంబర్ జాని తెలిపారు.

3క్వింటాళ్ల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కూర్మనూర్ పంచాయతీ పరిధి అటవీ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి 3క్వింటాళ్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధిదంచి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కలిమెల పోలీసులకు అక్రమ రవాణాపై సమాచారం అందింది. ఈ మేరకు ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్ తన సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా కూర్మనూర్‌కు వెళ్తుండగా, పోలీసుల రాకను పసిగట్టిన దుండగులు.. బైక్‌తో పాటు గంజాయిని వదిలి, పరారయ్యారు. దీనిని తూకం వెయ్యగా, 302 కిలోలు ఉందని ఐఐసీ తెలిపారు. సరుకు రూ.20 లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన వివరించారు.



శ్రీమందిరం సింహద్వారం

- శ్రీమందిరం సింహద్వారానికి వెండి తాపడం
- పనులు ప్రారంభించిన ఆలయ పాలకవర్గం
- ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న ఏఎస్ఐ అధికారులు
- నీలాద్రివిజే సమయానికి పూర్తి చేసేందుకు సన్నాహాలు



శ్రీమందిరం గర్భాలయం తనిఖీ నిమిత్తం వచ్చిన ఏఎస్ఐ బృందం

వేణు మాధవునికి.. వెండి వెలుగులు

భువనేశ్వర్: జగన్నాథుని క్షేత్రం నిత్యం కళకళలాడుతుంటుంది. భక్తుల మధ్య నిరంతరం ప్రత్యక్ష దైవంగా సాక్షత్కరించి భక్తజన హృదయాల్లో సుస్థిరంగా నెలకొనే భగవంతునిగా జగన్నాథుడు అత్యంత సన్నిహితుడు. ఏటా వార్షిక రథయాత్ర పురస్కరించుకుని శ్రీమందిరం ఖాళీ అయి, గుండిచా మందిరం కళకళలాడుతోంది. నవ దినాత్మక యాత్ర పురస్కరించుకుని స్వామి నిత్యం కొలువుదీరే శ్రీమందిరం రత్నవేదిక సరికొత్తగా పటిష్టత సంతరించుకోవడం యాత్ర వెనుక మరో విశేషం. గుండిచా నుంచి మూల విరాట్‌లు తిరిగి వచ్చేసరికి శ్రీమందిరం గర్భాలయం నిర్వహణ, మరమ్మతు, పునరుద్ధరణ తదితర కార్యకలాపాలు పూర్తి చేస్తారు. దీనికి అనుగుణంగా పనులు చకచకా సాగుతున్నాయి. ఈ పనులను భారతీయ పురావస్తుశాఖ(ఏఎస్ఐ) ప్రత్యక్ష పర్యవేక్షణలో చేపడుతున్నారు. విభాగం టెక్నికల్ కోర్ కమిటీ సభ్యులు, నిర్మాణ విభాగం అధికారులతో కూడిన 20మందికి పైగా అధికారులు బహుళ–క్రమశిక్షణా బృందం జగన్నాథాలయం సంరక్షణ వార్షిక సంయుక్త తనిఖీలు చేపట్టింది. ఆలయ అంతరాలయం గర్భగుడి, నాట్యమండపం, జగమోహన మండపం, పోటు ప్రాంగణం, భోగ మండపం స్థితిగతులను నిశితంగా పరిశీలించారు. 'ఏటా తరహాలోనే గర్భగుడి పరిస్థితిని పరిశీలించాం. జగమోహన పరిరక్షణ పనులు పూర్తయ్యాయి. ఇంకా ఏమైనా చేయాల్సిన అవసరం ఉందో లేదో తనిఖీ చేస్తాం. అలాగే నాట్య మండపాన్ని కూడా పరిశీలిస్తా'మని ఏఎస్ఐ మాజీ సూపరింటెండింట్ ఇంజనీర్ అశోక్‌కుమార్ మహాపాత్ర తెలిపారు. గర్భగుడి, నర్తనశాల, సభా మందిరం లోపల ఏర్పడిన మసి పొరను రసాయనిక ద్రవ్యాలతో శుభ్రం చేసి, ఆలయం లోపల మొదటి, రెండో అంతస్తులను శుభ్రపరచడం, వెంటిలేషన్ విధానాన్ని పరిశీలించడం వంటికి నీలాద్రివిజే లోగా పూర్తవుతాయని వివరించారు.

బొద్దింకలు నివారణ..

గత కొన్ని నెలలుగా ఆలయ గర్భగుడిలో ఎలుకలు, బొద్దింకలు చొరబడుతున్నాయి. వీటితో విపత్కర పరిస్థితులు తలెత్తుతాయనే భయాందోళనలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా మూల విరాట్‌లకు వీటి వల్ల భంగం కలిగే ప్రమాదం పట్ల ఆందోళన వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నివారణకు చర్యలు చేపడుతున్నారు. ఎలుకలు, బొద్దింకల బెడదను అరికట్టడానికి బయోటెక్ విధానంతో చక్రాలు బిగించి వాటి ప్రవేశాన్ని నిరోధించడానికి ప్రవేశ రంధ్రాలను మూయడం వంటి చర్యలు చేపట్టనున్నారు. నిపుణులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందం ఈ సమస్యను పరిశీలిస్తోంది. అవసరమైన చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. నిర్ధారిత గడువులోగా ఈ పనులు పూర్తి చేయడం జరుగుతుందని జగన్నాథ ఆలయ పరిపాలన(ఎస్‌జేటీఏ) వర్గం చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రంజన్‌కుమార్ దాస్ తెలిపారు.

క్వింటా వెండి విరాళం..

జగన్నాథుని ప్రధాన ఆలయం శ్రీమందిరం సింహ ద్వారం తలుపులకు వెండి తాపడం పనులు ప్రారంభించారు. పాత తలుపులు తొలగించారు. ఆలయ నిర్మాణ శైలిలో వివిధ ఆచారాల పరిరక్షణ పురస్కరించుకుని సేవకులు, భద్రతా అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పనులు చేపడుతున్నారు. ముంబై ప్రాంతంలో ఓ సంస్థ తయారు చేసిన తలుపుల స్టీల్ ఫ్రేమ్‌ను సింహద్వార్‌లో అమర్చనున్నారు. 5 క్వింటాళ్ల బరువున్న ఉక్కు ఫ్రేమ్‌లకు చెక్క పలకలు అమర్చనున్నారు. అనంతరం తలుపులకు వెండి కవచం అతికించనున్నట్లు ముంబైకి చెందిన ఓ భక్తుడు వెండి తాపడం ప్రక్రియకు క్వింటా వెండి విరాళంగా అందించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. వెండి తుప్పు పట్టకుండా డోర్ బోల్ట్ విధానం అనుసరించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆలయం లోపల 8 తలుపుల వెండి తాపడం పనులు పూర్తి చేశారు. మూల విరాట్‌లు జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రలు 9రోజుల గుండిచా యాత్ర పూర్తి చేసుకుని శ్రీమందిరానికి తిరిగి వచ్చేలోగా తలపెట్టిన ఆలయ మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలని నిరవధికంగా శ్రమిస్తున్నారు.



వెండి తాపడం పనుల కోసం చేరిన సామగ్రి

గుండిచా ఆలయంలో 'అడపా ఒబొధ'



జగన్నాథుని దర్శనానికి ఎండలో వేచి ఉన్న భక్తులకు నీళ్ల సీసాలు అందిస్తున్న పోలీసులు



జగన్నాథుని మహాప్రసాదం ఒబొధ

భువనేశ్వర్: శ్రీమందిరం సింహద్వారం నుంచి బొడొదండొ మార్గంలో అత్యంత అట్టహాసంగా బయల్దేరిన బలభద్ర, సుభద్ర, జగన్నాథ దేవతామూర్తులు.. రథాలపై రెండు రాత్రులు ఆరుబయట గడిపారు. అనంతరం గురువారం రాత్రి మంత్రోచ్ఛరణ మధ్య అడపావిజే ఉత్సవ ఊరేగింపులో జన్మపీఠం అడప మండపానికి చేరారు. శుక్రవారం ఉదయం నుంచి వేలాది మంది భక్తులకు జన్మపీఠంపై దర్శనం లభిస్తోంది. దర్శనంతో పాటు స్వామి మహాప్రసాదం అడపా ఒబొధ భక్తులకు అందుబాటులోకి వచ్చింది. గుండిచా ఆలయంలో జగన్నాథుడు తోబుట్టువులతో 7రోజులు కొలువుదీరడంతో తొలిరోజు దర్శనానికి వేలాదిమంది తండోప తండాలుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అడపా ఒబొధ ఆస్వాదించారు.

గుండిచా విశిష్టత..

అడపా ఒబొధ ఒక్క మెతుకునైన ఆస్వాదించగలిగితే అనేక జన్మల పుణ్యఫలం ప్రాప్తిస్తుందనే నమ్మకం జనాదరణ పొందింది. ఏడాది పొడవునా జగన్నాథుడు తన తోబుట్టువులతో యాత్రలో తరలివచ్చి, గుండిచా మందిరంలో విడిది చేసే 9రోజులలో దర్శించుకున్న శ్రీమందిరంలో ఏడాది పొడవునా పొందే దర్శన ఫలం ప్రాప్తిసుందని భక్తుల విశ్వాసం.

సులభ దర్శనం..

గుండిచా ఆలయం లోపల పవిత్ర చతుర్థా మూర్తులను భక్తులు సులువుగా దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. అడపా ఒబొధ విక్రయంలో అక్రమాల నివారణకు నిఘా వేస్తున్నారు. ప్రధానంగా ప్రసాదం ధరల పెరుగుదల లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో అనుబంధ ఏర్పాట్లు చేశారు. దర్శనం కోసం ఆలయం లోపల, బయట కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మండుటెండలో బారులు తీరే భక్తులకు వడదెబ్బ నుంచి రక్షించేందుకు చన్నీటి సించనంతో పాటు తాగునీటి సీసాలను పోలీసు యంత్రాంగం ఉచితంగా పంపిణీ చేస్తోంది.

ధూపదీపాదులతో నైవేద్యం..

ఉదయం ధూప దీపాదుల అనంతరం సువార్, మహాసువార్ నియోగ్ సేవాయత్‌లు స్వామివారి మహాప్రసాదం సిద్ధం చేశారు. అడపా మండపంలో చతుర్థా మూర్తులను దర్శనం చేసుకున్న తర్వాత కోటిజన్మల పుణ్యం ప్రసాదించే అడపా ఒబొధ భక్తులకు అందజేశారు.

నోట్ల కట్టలు!

- నవరంగ్‌పూర్ అదనపు సబ్ కలెక్టర్ నివాసాలపై విజిలెన్స్ దాడులు
- 3.17 కోట్లకు పైగా నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు



ఏడీఎం ప్రశాంత్‌కుమార్



పట్టుబడిన బంగారు బిస్కెట్లు, ఆభరణాలు

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా అదనపు సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ రౌత్ నివాసంలో కోట్లాది రూపాయల నగదు పట్టుబడింది. శుక్రవారం తెల్లవారుజామునే 9వేర్వేరు ప్రాంతాల్లో ఆయనకు చెందిన ఆస్తులపై విజిలెన్స్ బృందాలు ఏకకాలంలో దాడులకు దిగారు. నవరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉన్న ఏడీఎంను నిద్ర లేపి, తనిఖీలు ప్రారంభించారు. అక్కడ రూ.12 లక్షల నగదు పట్టుబడింది. రెండు ప్రభుత్వ ఉద్యోగాలలో ఉండటంతో డీఆర్‌డీఏ కార్యాలయం పక్కన ఉన్న మరో ప్రభుత్వ క్వార్టర్‌లో రూ.77 లక్షల నగదు లభించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు ఖంగు తిన్నారు. వెంటనే దూకుడు పెంచారు.

అధికారులను చూసి..

భువనేశ్వర్‌లోని కన్న విహార్‌లో ప్రశాంత్‌కుమార్‌కు మరో ఇల్లు ఉందని తెలిసి మెరుపు దాడికి దిగారు. అధికారులు రావడం దూరం నుంచి గమనించిన కొందరు వ్యక్తులు భవనం పైనుంచి కొన్ని పెట్టెలు మరో భవనం పైకి విసరడాన్ని గమనించారు. దీంతో తలుపులు విరగ్గొట్టి, అధికారులు ప్రవేశించేసరికే దుండుగులు పరారయ్యారు. అక్కడి పెట్టెలను స్వాధీనం చేసుకోగా, ఇందులో రూ.2 కోట్ల 25 లక్షల నగదు బయటపడింది. దీంతో పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. అతని స్వస్థలం భద్రక్, నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద తనిఖీలు చేపట్టారు. సాయంత్రం ఉమ్మర్‌కోట్ పట్టణంలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో 24సెంట్ల వాణిజ్య స్థలాన్ని అతని సోదరుడి పేరుమీద, ఖరీదైన భవనాలు సైతం ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు బంగారం బిస్కెట్లు, లెక్కలేనన్ని డిపాజిట్లు, భూ పత్రాలు, వివిధ బ్యాంకుల్లో లాకర్లు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన దాడుల్లో ఇద్దరు అదనపు ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 8మంది ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నట్లు రాష్ట్ర విజిలెన్స్ కార్యాలయం ప్రకటించింది.

గతంలో కూడా..

ఏడీఎం ప్రశాంత్‌కుమార్ గతంలో సుందర్‌గడ్ జిల్లా బిశ్రా సమితి కేంద్రంలో సమితి అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న సమయంలో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా విజిలెన్స్‌కు పట్టుబడ్డారు. ఆ కేసులో జైలుకు వెళ్లి, తిరిగి వచ్చి మళ్లీ విధుల్లో చేరారు. నవరంగ్‌పూర్ జిల్లాలో ఇసుక మాఫియాతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై గతం లో ట్రాక్టర్ల యజమానులు ఆందోళనకు దిగడం గమనార్హం. ఏడీఎం నివాసంలో కోట్ల రూపాయాల నగదు లభ్యం కావడంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. పేదరికంతో బాధపడే గిరిజన జిల్లా.. ఓ ఉన్నతాధికారి వద్ద భారీ స్థాయిలో నగదు పట్టుబడటం ఆందోళన కలిగించే అంశమని డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం సాయంత్ర నవరంగపూర్ లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అవినీతి అధికారిని ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి



ప్రశాంత్‌కు చెందిన ఖరీదైన భవనం

ఒప్పంద ఉద్యోగుల 'ఛలో కలెక్టర్'



పర్లాకిమిడి: కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్న ఉద్యోగులు

- 12 డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రాజీవ్ పాఢి

పర్లాకిమిడి: జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రశాఖ పిలుపు మేరకు శుక్రవారం ఛలో కలెక్టరేట్ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, పీఎఫ్ మంజూరు తదితర డిమాండ్లు పరిష్కారించాలని కోరారు. ఈ మేరకు సీఎం పేరిట వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాజేంద్ర మింజ్‌కు అందజేశారు. జిల్లాలో దాదాపు 400లకు పైగా ఉద్యోగులు పని చేస్తున్నారని, వారందరికీ న్యాయం చేయాలన్నారు. జూలై 10 లోగా ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. నిరసనలో రాష్ట్ర ఒప్పంద ఉద్యోగల సంఘం అధ్యక్షుడు రాజీవ్ పాఢి, సంఘం కార్యదర్శి పంకజ్‌కుమార్ పాత్రో, ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏడీఎం ప్రధాన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఒప్పంద ఉద్యోగులు

ఉద్యోగుల నినాదాలు..

రాయగడ: ఒప్పంద ఉద్యోగులుగా నియమించిన ప్రభుత్వం.. కష్టానికి తగిన వేతనం చెల్లించడం లేదని రాయగడ ఒప్పంద ఉద్యోగుల సంఘం శుక్రవారం ఆందోళనకు దిగింది. ఈ మేరకు ముఖ్యమంత్రి పేరిట రాసిన వినతిపత్రాన్ని ఏడీఎం ధర్మానంద బెహరాకు అందజేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ కష్టాన్ని గుర్తించి, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అదేవిధంగా ఒప్పంద విధానానికి స్వస్తి పలకాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు వేతన మొత్తాన్ని పెంచాలని విన్నవించారు. కార్యక్రమంలో ఒప్పంద ఉద్యోగుల జిల్లా ఫెడరేషన్ అధ్యక్షుడు సుశాంత్ పట్నాయక్, కార్యదర్శి ఉమా పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26 నుంచి కుష్టువ్యాధి సర్వే

అరసవల్లి: ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు జిల్లా వ్యాప్తంగా కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.అనూరాధ శుక్రవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలపై ఆరా తీస్తారని పేర్కొన్నారు. కుష్టు వ్యాధిని బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ)తో పూర్తిగా నయం చేయవచ్చునని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు లభిస్తున్నాయన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం రూరల్: జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. బైరి గ్రామం పరిధిలో జరుగుతున్న పంట కాలువ అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్దేశిత కొలతల మేరకు రెండు పూటలా పని చేస్తే గరిష్ట వేతనం రూ.272 పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సీతారాం, జేఈ బాలముకుందం బాబు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి పుష్పాభిషేకం



పుష్పాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నది ఒడ్డున ఉన్న బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి పుష్పాభిషేకం నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు, యంత్రపూజ, ద్వాదశి హారతులు, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీఈవో ఆర్.వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. 38 మండలాల జెడ్పీటీసీలు, స్థానిక జిల్లాతో పాటు విజయనగరం, మన్యం పార్వతీపురం జిల్లాల అధికారులు తమ శాఖల ప్రగతినివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో విజయదర్గ



శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గ అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, ఫణికుమార్ శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బోధనా పద్ధతుల్లో మార్పు అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత విద్యా విధానంలో వస్తున్న మార్పులు నేపథ్యంలో బోధనా పద్ధతుల్లోనూ మార్పు లు అనివార్యమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వర రావు అన్నారు. ఎస్‌సీస్ సాఫ్ట్‌వేర్‌పై నిర్వహించిన రెండు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో అనేక మార్పులు వస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు గమనించి పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లు విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్. సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కె.మోహన్‌కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

కూర్మావతారంలో కమల లోచనుడు



రాయగడ: వరాహావతారంలో దర్శనమిస్తున్న దేవతామూర్తులు



పర్లాకిమిడి: గుండిచా మందిరంలో నృసింహ, వరాహావతారంలో జగన్నాథుడు



రాయగడ: దీపారాధనలో మహిళలు



బరంపురం: హనుమాన్ బజార్‌లో కూర్మావతారంలో స్వామివారు

- నేడు హీరా పంచమికి ఏర్పాట్లు

రాయగడ: పట్టణంలోని గోపబంధు కూడలి సమీప గుండిచా మందిరంలో కొలువైన జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతామూర్తులను దర్శించుకునేందుకు భక్తుల తాకిడి పెరిగింది. దేవతామూర్తులు శుక్రవారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. స్థానిక వేంకటేశ్వర్ సేవాదళ్‌కు చెందిన మహిళలు విష్ణుసహస్ర నామ పరాయణం చేపట్టారు. అలాగే మహిళలు దీపార్చనతో భక్తిభావాన్ని పెంపొందించారు.

బరంపురం: నగరంలో రథయాత్ర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. స్థానిక హనుమాన్ బజార్ గుండిచా మందిరంలో జగన్నాథ్ స్వామి వరాహ అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసారు. సాయంత్రం దౌత్యపతులు ఇచ్చిన ప్రత్యేక హారతి తన్మయులను చేసింది. నగరంలోని వివిధ ప్రదేశాల్లో జగన్నాథ, బలభద్ర, సుభద్రా మూర్తుల నవయవ్వన యాత్రకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

పర్లాకిమిడి: గుండిచా మందిరంలో జగన్నాథుడు.. వరాహ, నృసింహ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర గ్రామీణ ప్రాంతాల నుంచి యాత్రికులు తండోపతండాలుగా వచ్చేసి, పురుషోత్తముని దర్శించుకున్నారు. శనివారం హీరా పంచమి సందర్భంగా రథయాత్ర కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రథాశ్వాలను శ్రీమందిరం వైపు మలుపు తిప్పనున్నారు.



బరంపురం: మూలవిరాట్‌ల దర్శనాల్లో భక్తజనం

కాసీపూర్‌లో లోక్‌కళా నృత్యాలు



కార్యక్రమంలో సంప్రదాయ నృత్య ప్రదర్శన

రాయగడ: రాష్ట్రంలో సంప్రదాయ లోక్‌కళా, సంస్కృతి, భాషలను సరిరక్షించడంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని కాసీపూర్ సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి అన్నారు. సమితి కార్యాయం ప్రాంగణంలో గురువారం సాయంత్రం నిర్వహించిన లోక్‌కళా నృత్యాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ, సంస్కృతి, భాషలను పరిరక్షించాలనే ఉద్దేశంతో సీఎం నవీన్ పట్నాయక్ జూన్ 14ను లోక్‌కళా దినోత్సవంగా ప్రకటించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో 2019నుంచి నిరవధికంగా ప్రతి జిల్లా, సమితుల్లో ఉత్సవాలు, స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తూ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎంతోమంది కళాకారులు కళారంగం పైనే ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి, పింఛన్ కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. అలాగే నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు ఈ సందర్భంగా ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో కాసీపూర్ సమితి లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు, హరిజనులు, సంప్రదాయ వేషధారణలతో నృత్య ప్రదర్శనలు నిర్వహించి, ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఏబీడీఓ పద్మిని కుహారొ, జిల్లా కళా సంస్కృతి విభాగం ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్ బొడ్రా, బీజేడీ నాయకుడు బినోద్ నాయక్, కృష్ణచంద్ర పూజారి తదితరులు పాల్గొన్నారు.



కళాకారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు

జర్నలిస్టులపై దాడి అమానుషం



పర్లాకిమిడి: ఎస్పీ స్వాతీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

- బాధ్యుతలపై వెంటనే అరెస్ట్ చేయాలని ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల డిమాండ్

జయపురం: పూరీ రథాయాత్ర సమయంలో ఇద్దరు జర్నలిస్టులపై దాడి జరిపి, హత్య చేస్తామని బెదిరించిన సేవాయత్ లను వెంటనే అరెస్ట్ చేయాలని కొరాపుట్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జర్నలిస్ట్ సంఘాలు డిమాండ్ చేశాయి. బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరాయి. ఈ మేరకు బొరిగుమ్మ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బిజయనారాయణ సాహు నేతృత్వంలో సమితిలోని జర్నలిస్టులు సబ్ డివిజన్ పోలీసు అధికారి మధుసిక్త మిశ్రాను శుక్రవారం కలిశారు. సీఎం నవీన్ పట్నాయక్ పేరిట రాసిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. రథాయాత్ర సమయంలో వార్తలు సేకరించేందుకు వెళ్లిన జర్నలిస్టులపై సేవాయత్‌లు మాధవ మహాపాత్ర, మాధవ పూజా పండా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడే ఉన్న అధికారులు కలుగ జేసుకోవడంతో దాడి నుంచి ప్రాణాలతో బయట పడ్డారని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

గజపతిలో నిరసన..

పర్లాకిమిడి: పూరీలో రథయాత్ర వార్తల సేకరణకు వెళ్లిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై సేవాయత్‌ల దురుసు ప్రవర్తనపై గజపతి జిల్లా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు నిరసన వ్యక్తంచేశారు. ఈ మేరకు సీఎంకు రాసిన వినతిపత్రాన్ని జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం రాజేంద్ర మింజ్‌కు అందజేశారు. న్యూస్7 బ్యూరో రిపోర్టర్లు చంద్రశేఖర పాత్రొ, చిత్తరంజన్ మహంతి లకు తీవ్ర గాయాలయ్యాయని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు క్లబ్ చైర్మన్ బిధాన్ చౌదరి, ద్విజేంద్ర పాఢి తెలిపారు.



ఎస్‌డీపీఓ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

డ్రైవర్ మహాసంఘం భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డ్రైవర్లు

రాయగడ: రాష్ట్రప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేసిన ఒడిశా డ్రైవర్ల మహాసంఘం పట్టణంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించింది. సంఘం అధ్యక్షుడు జితేంద్ర నాయక్, ఉపాధ్యక్షుడు జగ్‌జీవన్ కుమార్ నాయకత్వంలో రాయగడ జగన్నాథ మందిరం నుంచి మెయిన రోడ్డు మీదుగా రైల్వే అభినందన ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సభలో పలువురు వక్తలు ప్రసంగించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంఘం డిమాండ్లలో భాగంగా డ్రైవర్లందరికీ బీమా కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.



ఓస్డమాతో ఆంధ్రప్రదేశ్ అధికారుల చర్చలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్‌కుమార్, అధికార బృందం ఒడిశా స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీని(ఓస్డమా) శుక్రవారం సందర్శించారు. రాష్ట్రంలో విపత్తు నిర్వహణ కార్యక్రమాలకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించడం తోపాటు ఓస్డమా మేనేజింగ్ డైరెక్టర్‌తో చర్చలు జరిపారు.

- భువనేశ్వర్

లింగరాజు సేవాయత్‌లు అరెస్ట్



బలవంతపు వసూళ్ల ఆరోపణలపై అరెస్టయిన నిందితులు

భువనేశ్వర్: భక్తులతో దురుసు ప్రవర్తన, బలవంతంగా విరాళాలు వసూలు చేసిన ఆరోపణలపై నలుగురు సేవాయత్‌లను పోలీసులు అరెస్టు చేశారు. భువనేశ్వర్ లోని లింగరాజ దేవస్థానంలో మహాప్రభువు దర్శనానికి వచ్చిన భక్తుడు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. మన్మోహన్ మహాపాత్ర, బీరా బెహ రా, కృపాసింధు మహాపాత్రొ, ప్రకాష్ బటు లను నిందితులుగా గుర్తించారు. మందిరానికి వచ్చే భక్తులను వేధిస్తున్నారని, భక్తులను దుర్భాషలాడి కించపరచడంతో పాటు విరాళం కోసం బలవంతం చేస్తున్నట్లు భక్తులు విచారం వ్యక్తంచేశారు. అరెస్టయిన సేవకులపై గతంలో ఇదే తరహా కేసులు నమోదైనట్లు పోలీసు అధికారి తెలిపారు. ఘటనపై విచారణ పూర్తి చేసి, చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రంలో యంత్రాంగ పాలన

- శంకుస్థాపనలకే సీఎం నవీన్ పరిమితం
- రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శలు



ప్రసంగిస్తున్న జేపీ నడ్డా



భవానీపట్న సభలో ఐక్యత చాటుతున్న బీజేపీ ప్రముఖులు

భువనేశ్వర్: రాష్ట్రంలో బిజూ జనతాదళ్ ప్రభుత్వ పాలన తీరుపై భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విరుచుకు పడ్డారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కలహండి జిల్లాలోని లాల్‌బహదూర్ శాస్త్రి స్టేడియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ 'గరీబ్ కల్యాణ్' సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... ఒడిశా ప్రభుత్వాన్ని 50శాతం కమీషన్‌గా పేర్కొన్నారు. 'ఒడిశాను ఎవరు నడుపుతున్నారు? ఈ రాష్ట్రాన్ని నడిపిస్తున్నది అధికారులా? లేక నాయకులా? అసలు రాష్ట్రాన్ని నడిపేది అధికారులే అని ఎవరో చెప్పాలన్నారు. సీఎం నవీన్ పట్నాయక్ పాలనను యంత్రాగానికి అప్పగించారని ఆరోపించారు. బీజేడీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఎవరూ పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు.

ఒడిశాలో కమలం వికసించే సమయం ఆసన్నమైందని ధీమా వ్యక్తంచేశారు. మహిళల పట్ల అత్యాచారాలు, అత్యల్ప తలసరి ఆదాయం, వ్యవసాయ కుటుంబాలకు అత్యల్ప సగటు నెలవారీ ఆదాయం వంటి దీర్ఘకాలిక సమస్యలను అధిగమించి, పురోగతి సాధించడంలో 23 ఏళ్ల బీజేడీ దీర్ఘకాలిక పాలన పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దీంతో రాష్ట్రం వెనుకబడి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు ఈనెల 2న బహనాగా బజార్‌లో జరిగిన ట్రిపుల్ రైలు ప్రమాదంలో మృతులకు నివాళులర్పించారు.

మోదీకి ఆదరణ ఓర్వలేకే..

ప్రధాని నరేంద్రమోదీ ఒడిశాలోని 3.5 కోట్ల మందికి ఉచితంగా రేషన్ అందించారని, నేడు ప్రపంచం ఆయన నాయకత్వాన్ని గుర్తిస్తోందని జేపీ నడ్డా పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ తమపై కురిపిస్తున్న ప్రశంసలు, ప్రేమను జీర్ణించుకోలేక పోవడం దురదృష్టకరమన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నేతృత్వంలో పాట్నాలో ప్రతిపక్షాల సమావేశంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఒడిశాలో వాస్తవ లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద ఇళ్లు లభించడం లేదని, అనర్హులు లబ్ధి పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌తో ఈ మేరకు సంప్రదించనున్నట్లు ప్రకటించారు. కుంభకోణానికి పాల్పడిన వారిని కటకటాల వెనక్కి నెట్టివేస్తామని హెచ్చరించారు. 11 కోట్ల మంది ప్రజలు ఆయుష్మాన్ భారత్ యోజన ప్రయోజనాలను పొందారని, సీఎం నవీన్ మాత్రం దానిని అమలు చేయకపోవడంతో ఒడిశా ప్రజలు ఈ పథకాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆరోగ్య బీమా కవరేజీ అందించడమే ఈ పథకం లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జి డి.పురంధరేశ్వరి, స్థానిక ఎమ్మెల్యే ప్రదీప్తా నాయక్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

బీజేపీ కేంద్ర నాయకుల పర్యటన



కొరాపుట్: అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్

కొరాపుట్: భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకులు ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి గిరిరాజ్ సింగ్ నవరంగ్‌పూర్ కేంద్రంలోని సాయి కల్యాణ మండపంలో కేంద్రప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న గిరిజనులతో సమావేశమయ్యారు. సర్క్యూట్ హౌస్‌లో జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాకీసాన్ హోటల్‌లో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి కార్యక్రమంలో పాల్గొని, పార్టీ పతాధికారుల సమావేశంలో పాల్గొన్నారు. మరోవైపు కలహండి జిల్లాలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పర్యటించారు. మా మణికేశ్వరి దేవాలయాన్ని సందర్శించారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో నాయకులు ఆయనను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ నుంచి ఉద్యోగులను రిలీవ్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్జీఓ సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : వైద్య ఆరోగ్య శాఖ నుంచి బదిలీ అయిన ఉద్యోగులు ఐటీడీఏ పీఓ నుంచి రిలీవ్ ఆర్డర్లు పొందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్జీఓ సంఘం ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేసిన టి.సత్యవతి కోవిడ్ సమయంలో మృతిచెందారని, ఆమె కుటుంబానికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని కోరారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, ఎస్సీ వెల్ఫేర్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బడియా కామరాజు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాయి వేణుగోపాల్, ఏపీఎన్జీఓ పట్టణ అధ్యక్షుడు బొచ్చ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... పార్వతీపురం పట్టణం జగన్నాథపురం కాలనీ త్రినాథస్వామి గుడి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన రాగోలు గౌరీశంకరరావు, రాగోలు రాము, కె.సాయిలకు పలు చోట్ల గాయాలయ్యాయి. వీరు జగన్నాథపురానికి చెందిన వారు. గాయాల పాలైన వారిని 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

వ్యక్తి మృతి

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధి గొల్లపేట గ్రామానికి చెందిన నక్క రమణ(38) పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాలు.. కుటుంబ సమస్యల నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన రమణ పొలంలో పురుగుల మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు రమణను చికిత్స నిమిత్తం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని శుక్రవారం తెలిపారు.

ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న రాజేష్

పార్వతీపురం: ఇరుగు పొరుగు వారు కుటుంబ పరిస్థితిపై లేనిపోని మాటలు ఆడుతున్నారని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యా యత్నం చేశాడు. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... కొమరాడ మండలం కొండకోనేరు గ్రామానికి చెందిన బి.రాజేష్‌తో పాటు అమ్మ, చెల్లి ఒకే ఇంట్లో ఉంటున్నారు. అయితే చెల్లి ఒంటరిగా ఉండడం ఎవరి మాట వినకపోవడం, ఎటు వెళ్లినా చెప్పకపోవడం, అడిగితే చిరాకు పడడం తదితర కారణాలతో పాటు ఇరుగు పొరుగు వారు చెల్లిపై లేనిపోని మాటలు ఆడడంతో జీవితంపై విరక్తి చెందిన రాజేష్ పంట పొలాలకు వాడే పత్తి మందును శుక్రవారం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గజరాజులను కవ్వించొద్దు


- జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన



దుగ్గిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ: మండలంలోని దుగ్గి గ్రామంలో ఎనిమిది ఏనుగులు సంచరిస్తున్నాయని, వీటిని యూనిట్ ఫారెస్ట్ రేంజ్ అధికారి మణికంఠశ్వరతో పాటు ట్రెకర్స్ బృందం పర్యవేక్షిస్తుందని, ఎవరూ వాటిని కవ్వించొద్దని జిల్లా అటవీ శాఖ అధికారి జీఏపీ ప్రసూన శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అటవీ శాఖ అధికారులతో పాటు ట్రెకర్స్ క్షేత్ర స్థాయిలో ఉండాలని ప్రజలకు ఏనుగులతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు ఏనుగుల సంచారంపై గ్రామస్తులకు తెలియజేయాలని సూచించారు. ఏనుగులను ఎటువంటి కవ్వింపు చర్యలకు గురి చేయొద్దని కోరారు. ఏనుగుల వల్ల నష్టపోయిన పంటలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.2.17 కోట్లు పరిహారం చెల్లించనట్టు తెలిపారు. మరో రూ.28 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే చెల్లిస్తామని పేర్కొన్నారు.

జీసీసీ స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన పీఓ



కురుపాంలోని జీసీసీ స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

కురుపాం: మండల కేంద్రంలోని జీసీసీ స్టాక్ పాయింట్‌ను పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ శుక్రవారం పరిశీలించారు. బియ్యం నిల్వలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా సకాలంలో రేషన్ దుకాణాలు, డీఆర్ డిపోలకు సక్రమంగా నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని, ఏజెన్సీలో ఏ ఒక్క రేషన్ కార్డు లబ్ధిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలని జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్‌ను ఆదేశించారు. జూలై నెల నుంచి కురుపాం, జి.ఎల్.పురం, సాలూరు, ఎంఎల్ఎస్ పాయింట్స్ నుంచి స్టేజ్-2 ట్రాన్స్‌పోర్ట్‌కు జీసీసీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాద్, కురుపాం ఎంఎల్ఎస్ ఇన్‌చార్జ్ బంగార్రాజు, గుమ్మలక్ష్మీపురం ఎంఎల్ఎస్ సూపరింటెండెంట్ ఎమ్.సాంబశివరావు ఉన్నారు.

పౌల్ట్రీలకు ఎదురు దెబ్బ

ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది వేసవిలో ఎండల మండిపోవడంతో పౌల్ట్రీ దెబ్బతింది. ఫలితంగా కోడి, చికెన్ ధరలు కొండెక్కాయి. వీటి ధరలు వినియోగదారులకు చుక్కలు చూపించాయి. ఇప్పటికీ ధరలు ఇంకా తగ్గుముఖం పట్టలేదు.

- వేసవి తీవ్రతతో తగ్గిన ఉత్పత్తి- పెరిగిన చికెన్ ధరలు
- జిల్లా వ్యాప్తంగా 83 బ్రాయిలర్ పౌల్ట్రీ ఫారాలు
- ప్రతీ నెల 25 లక్షల కోళ్ల ఉత్పత్తి
- జూన్‌లో 22 లక్షలకు పడిపోయిన ఉత్పత్తి



కాకరాపల్లి పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లు

రాజాం : ఈ ఏడాది వేసవి ఎండలు ఇటు ప్రజలతో పాటు అటు వ్యాపారులను, రైతులను ఇబ్బందులకు గురి చేశాయి. ప్రధాన ఉత్పత్తి, లాభాదాయకమైన పౌల్ట్రీ నిర్వహణకు చుక్కలు చూపించాయి. రోజురోజుకు ఎండ తీవ్రత పెరిగి, వడగాడ్పులు వేయడంతో పౌల్ట్రీ ఫారాల నిర్వహణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆశించిన స్థాయిలో ఉత్పత్తి చేయలేక చతికిలపడ్డారు.

తగ్గిన దిగుబడి

జిల్లా వ్యాప్తంగా 83 బ్రాయిలర్ కోళ్ల పౌల్ట్రీలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వీటి ద్వారా 500 కుటుంబాల జీవనం సాగిస్తున్నాయి. ప్రతీ నెల పౌల్ట్రీలు ద్వారా జిల్లాలో 25 లక్షల నుంచి 27 లక్షల వరకూ కోళ్ల ఉత్పత్తి జరుగుతుంది. ఒక్కో కోడి పౌల్ట్రీకి వచ్చిన మూడు నెలల వ్యవధిలో కిలోన్నర నుంచి రెండు కిలోల వరకూ పెరుగుతుంది. అతి వెచ్చదనం కాకుండా, అతి చల్లదనం కాకుండా మధ్యస్తంగా ఉండే వాతావరణమే బ్రాయిలర్ కోళ్ల పౌల్ట్రీలకు అనుకూలంగా ఉంటాయి. సాధారణంగా వర్షాకాలంలో రకరకాల వ్యాధులు వచ్చి కోళ్లు మృత్యువాత పడుతుంటాయి. వేసవి ఎక్కువగా వీటికి అనుకూలంగా ఉంటుంది. ఈ ఏడాది మాత్రం అతి ఉష్ణోగ్రతలు, వీటికి తోడు వడగాడ్పులు పౌల్ట్రీని కుదేలు చేశాయి. పౌల్ట్రీకి వచ్చిన కోడి పిల్లలు పరిణితి చెందకముందే ఎండ తీవ్రతకు మృత్యువాత పడుతుండేవి. ఫలితంగా మే నెలలో జిల్లాలో కోళ్ల ఉత్పత్తి పడిపోయింది. 22 లక్షల కోళ్ల మాత్రమే ఉత్పత్తి జరిగింది.

చికెన్‌పై ప్రభావం

పౌల్ట్రీ కోళ్ల మృతి చెందడంతో ఈ ప్రభావం చికెన్ ధరలపై పడింది. ఏప్రిల్ నెల వరకూ కిలో చికెన్ ధర రూ.200 నుంచి రూ.240లు మధ్య కొనసాగేది. మే నెల చివరినాటికి కిలో చికెన్ ధర రూ.280లు నుంచి రూ.300లకు చేరుకుంది. కోడి ధర కిలో రూ.180లకు పెరిగింది. జిల్లా వ్యాప్తంగా మాంసాహారులు అధికంగా ఉండడంతో పాటు వేసవిలో ఎక్కువగా కార్యక్రమాలు జరగడం కారణంగా వీటి ధర పెరగడం ఒక ఎత్తు కాగా, ఉభయ గోదావరి జిల్లాలు నుంచి దిగుమతి కూడా జిల్లాలో అధికమైంది. ప్రస్తుతం వేసవి తీవ్రత తగ్గుముఖం పట్టడంతో వచ్చే నెలనాటికి పౌల్ట్రీలు ద్వారా కోళ్ల ఉత్పత్తి పెరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు వెల్లడిస్తున్నారు.

ఉత్పత్తి తగ్గింది



మా వద్ద మూడు పౌల్ట్రీ షెడ్లు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో భారీగా ఉత్పత్తి పడిపోయింది. ఒక టెర్మ్‌కు 1500 కోళ్ల ఉత్పత్తి ఉండేది. ఈ దఫా 1200 కోళ్ల మాత్రమే ఉత్పత్తి అయ్యాయి. వేసవి తీవ్రతకు చాలా కోళ్లు చనిపోయాయి. ధర మాత్రం పెరిగింది.
– చాపల పాపారావు, పౌల్ట్రీ యజమాని, కాకరాపల్లి, సంతకవిటి మండలం

వేసవి ఎఫెక్ట్..



ఈ ఏడాది వేసవి ఎఫెక్ట్ బాగా తగిలింది. చికెన్‌పై ఈ ప్రభావం చూపించింది. పౌల్ట్రీ నిర్వాహకులకు వేసవి అనుకూలించలేదు. ఫలితంగా బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. కోళ్లు పెరగక కూడా సాధారణ రోజులు కంటే తక్కువగా కనిపించింది. వచ్చే నెలలో ఈ ఉత్పత్తులు మళ్లీ పెరుగుతాయి.
– బొత్స జయప్రకాష్, ఏడీఏ, పశు సంవర్ధక శాఖ, రాజాం

సంపూర్ణ సంక్షేమ దీక్ష - 'జగనన్న సురక్ష'

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీజీ



డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఒక ఉత్తమమైన ఆలోచన అని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీజీ శంకరరావు శుక్రవారం పేర్కొన్నారు. ప్రజలకు సంక్షేమం అందించడంలో నెలకొల్పిన కొత్త ఒరవడిగా వాఖ్యానించారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడడం గొప్ప ప్రయత్నంగా తెలిపారు. అనర్హులకు పథకాలు అందినా ఫరవాలేదు కానీ ఒక్క అర్హుడికి కూడా ఏ పథకమూ దూరం కారాదన్నది మానవీయ ఆలోచనగా కొనియాడారు. సాధారణంగా ఏ పథకాలైనా డెబ్బై శాతం విజయవంతం అయితే పూర్తి విజయంగా లెక్కలు వేస్తారని, మిగతా ముప్పై శాతం వైఫల్యాన్ని కప్పి పుచ్చేస్తారని.. దానివల్ల పేరు గొప్ప పథకాలు కూడా వాస్తవానికి పూర్తిగా న్యాయం చేయకుండా పోతున్నాయన్నారు. అర్హులైన లబ్ధిదారులు వాటి కోసం పోరాడే శక్తివంతులు కాకపోవడమే ప్రధాన కారణంగా తెలిపారు. అమలు చేయాల్సిన వారు మరింత కష్టపడి అందని వారిని చేర్చుకోవాలన్న చిత్తశుద్ధి చూపించటం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయంలో లబ్ధిదారుల వైపు నుండి ఆలోచించబట్టే ఇంత మంచి కార్యక్రమం వాస్తవ రూపం దాల్చబోతోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అదీ నేరుగా పారదర్శకంగా అందించడంలో 99.5 శాతం విజయవంతమైనట్టు గణాంకాలు చెబుతున్నా 100 శాతం లబ్ధిదారులకు న్యాయం చేయాలన్న వైఖరితో ముందుకు వెళ్తున్నారని వివరించారు. రానున్న 15 రోజుల్లో ప్రతీ ఇంటికీ వెళ్లి సచివాలయాలతో సమన్వయం చేసుకుని వారి సమస్యల పరిష్కారానికి పూనుకొంటారని ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి కలెక్టర్ మొదలుకొని, ముఖ్యమంత్రి కార్యాలయం వరకూ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు. సంక్షేమం అందించడం కేవలం బాధ్యతగా తలచకుండా పవిత్ర యజ్ఞంలా భావించే ఈ కార్యక్రమం మిగతా రాష్ట్రాలకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు.

వర్చువల్ తనిఖీలు సరికాదు...

- ఏపీటీపీఐఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ (జీవీ) యూనివర్సిటీ అనుమతి అర్హత కోసం అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో చేపడుతున్న వర్చువల్ తనిఖీల (ఎఫ్ఎఫ్‌సీ) విధానాన్ని విరమించుకోవాలని, తనిఖీలు ఆఫ్‌లైన్‌లోనే జరగాలని ఏపీటీపీఐఈఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అనుబంధ కళాశాలల తనిఖీ విధానం వర్చువల్‌గా ఇటీవల యూనివర్సిటీ ప్రకటించిందని ఈ విధానం వల్ల కళాశాల యాజమాన్యాలు ఏ మాత్రం పారదర్శకం పాటించడానికి వీలుపడదని పేర్కొన్నారు. అదే విధంగా ఈ విధానం వల్ల అవినీతికి పాల్పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఆరోపించారు. ఉన్నత విద్యా విధానాన్ని రాష్ట్రంలో గాడిలో పెట్టాల్సిన బాధ్యత యూనివర్సిటీ అధికారులకు ఉందని జేఎన్‌టీయూ జీవీ అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు సూర్యారావు(ఫైల్)

భోగాపురం: విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అక్కివరపు సూర్యారావు(40) మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన అక్కివరపు సూర్యారావు ప్రైవేటు ఎలక్ట్రికల్ మరియు ప్లంబింగ్ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 16న ఇదే గ్రామానికి చెందిన చేట్ల సూరిబాబు పొలంలో మోటారు పని చేయడం లేదని, రిపేర్ చేయమని సూర్యారావు ఇంటికి వచ్చాడు. దీంతో సూర్యారావు ముంజేరులో ఉన్న తన హెల్పర్ నారాయణరావును తీసుకుని సూరిబాబు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. హెల్పర్ నారాయణరావు ద్వారా సమాచారం తెలుసుకున్న సూర్యారావు కుమారుడు ప్రసాద్, భార్య బంగారమ్మ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాలిన గాయాలతో పడి ఉన్న భర్తను వెంటనే విజయనగరం తిరుమల ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సూర్యారావు మృతి చెందాడు. మృతుని భార్య బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మజ్జి తోగులురెడ్డి (ఫైల్)

భోగాపురం: భార్య మందలించిదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం మండలంలోని కొత్తచెరుకుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తచెరుకుపల్లి గ్రామానికి చెందిన మజ్జి తోగులురెడ్డి(52) ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య నరసయ్యమ్మ, కుమారుడు ఆదిబాబు ఉన్నారు. ఇటీవల తోగులురెడ్డి మద్యానికి బానిసై వచ్చిన జీతం డబ్బులను ఇంటికి ఇవ్వకుండా రోజు మద్యం సేవించి భార్యతో గొడవకు దిగేవాడు. ప్రతిరోజు లాగే గురువారం కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. దీంతో భార్య నరసయ్యమ్మ తన కుమారుడుని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మరుసటి రోజు ఉదయం తోగులురెడ్డి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో పక్క ఇంట్లో ఉన్న మజ్జి శ్రీనివాసుకు అనుమానం వచ్చి తలుపులు తెరచి చూసేసరికి తోగులురెడ్డి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఫోన్ ద్వారా వెంటనే తోగులురెడ్డి కుమారుడు ఆదిబాబుకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఆదిబాబు తల్లి నరసయ్యమ్మతో కలిసి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే తోగులురెడ్డి మృతి చెందాడు. కుమారుడు ఆదిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

రాజాం సిటీ: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర కోశాధికారి జె.సింహాచలం మాట్లాడుతూ ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం, ఎంటీఎస్‌ను అమలు చేయాలని కోరారు. డిమాండ్ల సాధనకు జూలై 10న తాడేపల్లిలో నిర్వహించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రషణార బేగం, సిబ్బంది సునీతదేవి, శాంతి, రాంబాబు, సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితురాలు)

విజయనగరం క్రైమ్: హ్యాండ్ బ్యాగ్‌లో ఉంచిన ఆరు తులాల బంగారు గొలుసును దొంగతనం చేసిన మహిళను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలు... ఉడా కాలనీ ఫేజ్ -4లో నివాసం ఉంటున్న పెంట విజయలక్ష్మి స్థానిక కన్యక పరమేశ్వరీ ఆలయం వద్ద ఆటో ఎక్కి మార్గమధ్యంలోకి వచ్చేసరికి తన హ్యాండ్ బ్యాగ్ చెక్ చేసుకునే సరికి తన బ్యాగ్‌లో ఉన్న ఆరు తులాల బంగారు గొలుసు దొంగలించబడిందని గుర్తించింది. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఉల్లి వీధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న దాసు యేసుమణి అనే మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు ఆమె అంగీకరించిందన్నారు. ఆమె నుంచి ఆరు తులాల బంగారు గొలుసును రికవరీ చేసి, నిందితురాలని అరెస్ట్ చేశామన్నారు. సమావేశంలో వన్‌టౌన్ ఎస్‌ఐ అశోక్ కుమార్, హెచ్‌సీ అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

25న ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ డే రన్‌కు సంబంధించి టీ షర్టులు ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న విజయనగరం జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, ఉపాధ్యక్షుడు సుభాష్‌చంద్రబోష్ వెల్లడించారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఒలింపిక్ డే రన్‌కు సంబంధించిన టీ షర్టులను, టోపీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజు నగరంలోని రాజీవ్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే రన్ కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, గంటస్తంభం జంక్షన్, మెయిన్ రోడ్, మూడులాంతర్ల జంక్షన్, డీసీసీబీ రోడ్ మీదుగా కోట జంక్షన్ వరకు సాగుతుందన్నారు. ఈ ర్యాలీని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, పి.రఘువర్మ, విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు నగరంలో ఒలింపిక్ డే రన్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యమన్న స్ఫూర్తితో ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రన్‌ను నిర్వహించటం జరుగుతుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనంతో పాటు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు క్రీడల్లో పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.వేణుగోపాలరావు, కోశాధికారి నడిపిల్లి గురునాథ్, రెజ్లింగ్ అసోసియేసన్ రాష్ట్ర కార్యదర్శి రమణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మల్లిబాబు, దుర్గాప్రసాద్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు లీలాకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రవీంద్రనాథ్



జిఆర్.రవీంద్రనాథ్

విజయనగరం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఉప రవాణాశాఖ అధికారులు పని చేస్తున్నారని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జిఆర్.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏడాదిలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను కనీసం పది శాతానికైనా తగ్గించాలనే లక్ష్యంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు విద్యార్థులను తీసుకువెళ్లే బస్సులు, ఆటోలు, క్యాబ్‌ల డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ అందజేస్తామన్నారు. ఇందు కోసం ఆయా కళాశాలల్లోనే శిక్షణా తరగతులు కూడా నిర్వహిస్తామన్నారు. ఎల్ఎల్ఆర్, డీఎల్‌కి వచ్చే అభ్యర్థులకు ఆడియో, వీడియో విజువల్స్ తరగతులు నిర్వహించి, అవగాహన కల్పిస్తామన్నారు. అన్ని శాఖలతో కలిసి ప్రతి మూడు నెలలకొకసారి రోడ్డు ప్రమాదాల నివారణపై సమావేశం నిర్వహించి, బ్లాక్‌స్పాట్స్ గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. నగర పరిధిలో నాలుగువేల ఆటోలు తిరుగుతున్నాయని, వాటిలో మహిళల రక్షణకు వినియోగించే అభయం యాప్‌ను ఇప్పటివరకూ 1780 వరకూ ఇన్‌స్టాల్ చేశామన్నారు. ఇప్పటివరకూ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా 2022 - 23 సంవత్సరానికిగానూ 13వేల 830 మందికి ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున రూ. 138 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందజేశామన్నారు.

పొదుపు సంఘాల సభ్యుల అభివృద్ధికి చర్యలు

డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి

విజయనగరం అర్బన్: గ్రామాల్లోని మహిళా పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి అన్నారు. స్థానిక టీటీడీసీ మహిళా ప్రాంగణంలో మండల సమాఖ్య అధ్యక్షు లు, ఉపాధ్యక్షులు, మండల సమాఖ్య పాలక వర్గం విధులు, బాధ్యతలపై శుక్రవారం నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ దిశగా మండల సమాఖ్యలు అభివృద్ధిలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు పథక సంచాలకులు, డీపీఎం, ఐబీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో చోదకులపై కేసులు

పాలకొండ రూరల్: మితిమీరిన వేగం, అధిక లోడుతో నిబంధనలు అతిక్రమించిన ఆటో చోదకులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. పాలకొండ - సీతంపేట రహదారిలో వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వారికి అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌన్సెలింగ్‌కు 570 మంది హాజరు

విజయనగరం ఫూల్‌బాగ్: కాంట్రాక్టు పద్ధతిలో మినిమమ్ టైమ్ స్కేల్‌కు ఎస్జీటీలుగా నియమించబడిన డీఎస్సీ-2008, 1998 అభ్యర్థులకు అనుకూలమైన స్కూల్స్‌లో పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చేందుకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విజయనగరం రింగ్‌రోడ్డులోని పీఎస్ఆర్ స్కూల్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 570 మంది హాజరైనట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట గెస్ట్ టీచర్ల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శనలో కేజీబీవీ గెస్ట్ టీచర్లు

విజయనగరం అర్బన్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీల) కొన్నేళ్లుగా గెస్ట్ టీచర్లుగా కొనసాగుతున్న టీచర్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేజీబీవీ టీచర్లు మాట్లాడుతూ వేతనాలు తక్కువ ఇచ్చినా టీచింగ్ వృత్తిగా చేసుకొని కేజీబీవీల్లో పని చేస్తున్నామని అర్ధంతరంగా తొలగించడం వల్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వకుండా ఇటీవల వచ్చిన కొత్త వారిని తీసుకొనే భర్తీ నోటిఫికేషన్‌ను, ఆ నోటిఫికేషన్ ద్వారా చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలు చేస్తున్న న్యాయ పోరాటానికి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ సంఘాలు మద్దతు తెలిపాయి.

జోగింపేట కేజీబీవీ సందర్శన

సీతానగరం: మండలంలోని జోగింపేట కేజీబీవీను పాఠశాల విద్యాశాఖ కమిషనర్, నవరత్నాలు, జగనన్న సురక్ష జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. జగనన్న విద్యాకానుకల పంపిణీ, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యాబోధన తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జేవీకే కిట్ల నాణ్యతపై విద్యార్థులను ప్రశ్నించారు. గతేడాది అమ్మఒడి డబ్బులు అందరికీ అందాయా లేదా అని ఆరాతీయగా, అందరికీ అందినట్లు తెలిపారు. ప్రమాణాలతో కూడిన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్, జీసీడీఓ కె.రోజారమణి, సెక్టోరియల్ అధికారులతో పాటు మండల విద్యాశాఖాధికారులు సూరిదేముడు, ఎం.వెంకటరమణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జె.సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.



జోగింపేట కేజీబీవీ పరిసరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారి సురేష్‌కుమార్